తెగిపడిన చుక్క



అంగర వెంకటకృష్ణారావు

డాబామీద వెల్లకిలా పడుకొని ఆకాశంపై గారడీ చూస్తున్నాను. బహుళపంచమి రాత్రి. మలయమారుతం ధనవంతుడి సతీమణి కారులో వెన్నెలవిహారం చేస్తున్నట్టు గర్వాలసంచాన విశేషాలు చూపిస్తూంది. తెల్లని అంచుగల కోమల నీలజలదఖండికల నడుమ చంద్రుడు దాగుడు మూత లాడుతున్నాడు.

అప్పుడు కలిగింది నాకు సందేహం! ఈ వెన్నెల ఎంతోమంది హృదయాలలో వుల్లాసం కలిగించింది. ఎందరు విరహిజనులో దీనిలో కరకర వేగిపోయేరు. విరహవ్యథలే లేని కవులు, 'ఏవిరహార్తుడేని' అని ఎన్నో ఊహించు కుని విలపించేరు——

ఇక యీ జ్యోత్స్న వికాసంలో ప్రవాస దుఃఖితులు మొత్తలు కొట్టారు. ఇంకా యింకా అజ్ఞాతవ్యక్తుల్నికూడా తల్చుకుని భోరున ఏడ్చేరు ఎందరో!

అయితే ఒక్కగాని ఒక్కమానవుడు-కవిత్వం కోసం కవిగాని మానవమాత్రుడు, పైవారందరూ బాధపడే రుజాకిణాంకం, కుతపకాలరవికూడా కనిపెట్టలేని స్ఫటిక హృదయుడు 'బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టుతోంది' అని ఆక్రోశించాడు.

ఎందుకు 'భయపెట్టుతూంది'?—ఎందుకు!

మేఘాలు పరుగెడుతున్నాయి - యవని కాభ్యంతరము అప్పుడప్పుడు పొందుతున్నాడు చందమామ - వెలుగు నీడలమధ్యా, లేచిపడు తూన్న కనురెప్పలతో - కితకితలు పెట్టే చిరుగాలి చిక్కుడుకాయలవంటి వ్రేళ్లు శరీరంమీద పరు గిడుతున్నా, ఆలోచనాలు పని చేయక పోయినా, సందేహం సందడిస్తోంది.

అప్పుడే దక్షిణాశాకోణంలో, కరాళ మేఘముక్త అయిన ఒక తెల్లచుక్క మినుకుమంది. ఆ చుక్క నా వెంపే చూస్తూన్నట్టు - అది యేవో అవ్యక్త భావాలని నాతో చెప్పకుందామని, హృదయభారం ఆ విధంగా తగ్గించుకుందా మని ప్రయత్నిస్తున్నట్టయింది.

నేనా కరాళమేఘముక్త అయిన ప్రవాళ తారవెంపు చూస్తూంటే, ఆ వేదనానిలంవల్ల వూగి వూగి ఒక్కసారి 'రాలినెత్తురు క్రక్కుకుంటూ పేలిపోతుందే'మో అని భయం గొలిపి—అను కున్నట్టు పుటుక్కున తెగి జరజర జారిపోతూంది.

నేను వూపిరి బిగబట్టి చూస్తున్నాను-డాబా మెట్లవంటి మేఘశకలసోపానాలమీంచి శరవేగంతో జారి పరుగెత్తి—నా ఆశ్చర్యం యినుమడించేట్టు తకీమనివచ్చి నా ముందు పడింది.

ఆ చుక్క! ఒక చక్కని పధ్నాలుగేళ్ల చుక్క! రెండు బుగ్గలమీద మెరిసే కన్నీటి బొట్లు ఆమె దుఃఖావస్థతెలియజేశాయి-సంస్కారహీనమైన జుట్టు, చెంపకు చేరడేసి కళ్లల్లోంచి హృదయంలోకి దూసుకుపోయే చూపులు, ఆమెలో ప్రచ్ఛన్నమైన వుద్రేకాన్ని తెలియజేస్తున్నాయి.

నే నామెను చాపమీద కూచోమన్నాను.

గాభరాలో నే నా పిల్లపేరు అడగలేదు. అంచేత ఆమె అప్పటికీ యిప్పటికీ చుక్కే!

'నీ సందేహం తీర్చడానికి వచ్చాను' అని కొంచెం దగ్గరగా జరిగింది—చుక్క...

* * *

పదిహేడు ఏండ్లక్రిందట నా తండ్రి సబ్ రిజిస్ట్రారుపని చేస్తూ, సత్యాగ్రహసందర్భంలో వుద్యోగానికి రాజీనామా యిచ్చి కాపురస్థలం అయిన రామగిరి జమీందారీ

గ్రామం చేరుకున్నాడు సకుటుంబంగా. అప్పటి నుంచీ ఆయన గాంధీగారి అడుగుజాడలలో నడుస్తూ దేశసేవకీ, ప్రజాసేవకీ తన జీవితాన్ని అర్పణం చేశాడు.

ఉద్యోగరాహిత్యంతో కొంతరాబడి తగ్గినా, స్వగ్రామంలో చిన్న భూమిచెక్క వుండడం వల్ల కేవలం దరిద్రం అనుభవించే అవస్థపట్టలేదు మా కుటుంబానికి.

కాని మా తండ్రి ఉనికి ఆ జమీందారుకు ఏమీ అనుకూలంగా లేదు——గాంధీగారు వుపదేశించిన సత్యం, అహింస అక్షరాలా అమలు జరిపే అచంచల స్వభావుడే కాకుండా, మా తండ్రి మంచి నైతికపుష్టి కలిగిన సమాజవీరుడు. మా తల్లితోటే అతనికి కాంతలమీద మోహం పోయింది. స్వాతంత్ర్య సమరయోధుడుకాగానే, కనకంమీద కూడా ఆశ నశించి పోయింది. అంచేత వివిధ పరిస్థితులలో జమీందారు మా తండ్రిని స్వపక్షోన్ముఖుడిని చెయ్యడానికో లేక కార్యరంగంనించి విరమింప చెయ్యడానికో, ప్రయోగించిన అస్త్రాలు ఏమీ పనిచెయ్యలేదు.

దేశరాజకీయాలను క్రమంగా అనుసరిస్తూ, వుద్యమాలు తప్పిపోకుండా దీక్షగా పనిచేస్తూ, స్వగ్రామంలో గొప్పచైతన్యం కలిగించి, నిద్రిత మానవుల్ని మేలుకొలిపి, జమీందారుకు పరమ శత్రువు- సింహస్వప్నం అయేడు.

మా భూముల్ని జమీందారు స్వాధీనపరచుకున్నాడు- ఇంట్లోంచి వెళ్ళగొట్టేడు- చర్విత చర్వణంగా చెప్పడంకన్న, ధనవంతుడు ధనహీనులమీద జరిపే హింసాకాండ అంతా జరిపేడు.

దరిద్రం అనుభవిస్తూ లాఠీ దెబ్బలుతింటూ, జైళ్ళు అలంకరిస్తూ, అవమానం అనుభవిస్తూ మా తండ్రి ఆ గ్రామంలో కొంతమంది ఆదరమే ఆధారంగా, దేశసేవే తన పరమావధిగా, దేశముక్తి తన పరమలక్ష్యంగా, సత్యాహింసలు తోడుగా జీవితం సాగించేడు!

మొదటిసారి కాంగ్రెసు పదవులు స్వీకరించినప్పుడు ఎన్నికలలో మాతండ్రి పడ్డ కష్టం, జమీందారు జరిపిన దారుణాలు తలుచుకుంటే గుండెలు యిప్పటికీ దద్దరిల్లుతాయి.

(ఆమె నేత్రాలు వెన్నెల్లో మెరిశాయి. నేను వింటున్నాను ఊపిరి బిగబట్టి.)

అప్పటికి నాకు ఎనిమిదేళ్లుంటాయి-మిడిమిడిజ్ఞానం. కాని దేశభక్తివాసన గల వాతావరణంలో పుట్టడంవల్ల, చేతులు జోడించడం తెలిసిన నాటినుంచీ ప్రతి వుదయం మూడు రంగుల జండాకు మొక్కే అలవాటు అయి వుండడంచేత-నా లేత గుండెలలో కూడా

ఏవేవో భావాలుపుడుతూండేవి.

చదువు, సంస్కారం, పరిజ్ఞానం లేకపోయినా అహింసాతత్వం నాకు అంతనచ్చిందికాదు - పోలీసువాడు మా తండ్రిని లాఠీతో కొడుతూంటే ప్రక్కనున్న యిటిక బెడ్డ పుచ్చుకుని వాడితల ఎందుకు పగలగొట్ట లేదని మా తండ్రితో వాదించే దాన్ని.

కాలానుసరణంగా వయస్సు ఆయన రుధిరంలో శాంతరసం పోషించుకోస్తూ, నా నెత్తురులో వుద్రేకతరంగాలు రెచ్చగొట్టింది. నాకు పద్ధ్నాలుగేళ్లు వచ్చాయి.

చరిత్ర పురాణాదియుగాల్లో ముందెన్నడూ అహింసను గెలవలేదని—ధన బలగర్వితులైన నరరూప రాక్షసుల్ని దారుణ హింసామార్గాన్నే జయించాలని తండ్రితో వాదించేదాన్ని.

దేశనాయకులు పదవులకు రాజీనామాలుపెట్టి బంధితులైపోయారు - అప్పుడు మా తండ్రి కూడా జైలు అలంకరించేడు——

నిలవడానికి నీడలేని పరిస్థితిలో, తండ్రి జైలుపాలైపోగానే, నాలో ఒక మహాభీకరశోకదేవత గజ్జకట్టిన కాళ్ళతో నర్తించింది.

వీధుల్లో కార్లు పరుగెడుతూంటే - పెద్దపెద్ద హోటళ్లలో కప్పులు సాసర్లు గలగలమంటుంటే టిష్యూ చీరెలు ఒయ్యారంగా బీచి షికార్లు చేస్తూంటే - స్వతంత్రం ఎవరికి కావాలి, త్యాగం ఎవరు చెయ్యాలి అని నన్ను నేను ప్రశ్నించుకుని ఏడ్చేను.

రోజుకు పదిహేను గంటలు నూలు వడికితే నాకు ఒక పూట తిండి దొరకడం కష్టం అయేది.

హఠాత్తుగా వినపడ్డని ఆగస్టు విప్లవ శంఖారవం! నాలో అణగివున్న ప్రతీకారాగ్ని ప్రజ్వరిల్లి నాల్కలు జాపింది. విసిరి పారేశా రాట్నం ఒకమూల. నడుం బిగించి విప్లవరంగంలో దూకా! పరుగెడుతూన్న నాకెదురుగా ఆకాశం మీద ఝాన్సీదేవతగుఱ్ఱంమీదకృపాణపాణితో ప్రత్యక్షం అయి నన్ను దీవించింది.

(ఆమె నేత్రాలు అగ్నికుండాలవలె వెలిగాయి. ఆమె ప్రవాళాధరం స్పందించిపోయింది. కాని మరు నిమిషం ఆమెముఖం విషాద మేఘాచ్ఛాదితం అయింది.)

కాని, కాని నాజీవితకుసుమం విప్లవాగ్నిలో భస్మం అయింది. నావలె ఎందరెందరో వుడుకు నెత్తుటి యువజనులు నేటి స్వతంత్రభారతానికి బలి అయిపోయేరు.

తెల్లటోపీకి ఎఱ్ఱటోపీ నేడు సలాములు చేస్తూంది- ఖద్దరు బట్టలకి సీమనూలు సూటులు కాళ్ళు పిసుకుతూన్నాయి. కాని-

(ఆమెకు మాట పెగలడంలేదు- వెక్కి వెక్కి ఏడుస్తూంది.)

కాని నాతండ్రి ఆరోగ్యంచెడి- వృద్ధాప్యంలో, పక్షిలా అల్లాడుతున్నాడు. ఖద్దరు తువ్వాళ్లు అమ్ముకుని వచ్చే కమిషన్ అడ్డు పెట్టుకుందికి ప్రయత్నిస్తున్నాడు మృత్యువుకంట పడకుండా!

(ఆమె బావురుమని ఏడ్చింది - నా గుండె దహించుకుపోయింది. కాని ఏం చెయ్యగలను!)

అనిత్యమైన అసత్యమైన యీ వెన్నెలలో మరుగుపడిపోయి, చరిత్రహీనంగా వున్న నా శోకమయ జీవితాన్ని కనిపెట్టే అత డెవరో 'బహుళపంచమి జ్యోత్స్న భయ పెట్టులోంది' అని విలపించి వుండాలి-నీ సందేహం తీరిందో లేదో గాని నాగోడు కొంత చెప్పుకుని నా హృదయభారం తగ్గించుకున్నా. ఇక సెలవు" అని ఆమె వచ్చినమార్గాన్నే మేఘశకల సోపానా లెక్కి ఆకాశంలో అంతర్ధానం అయింది.

'ఇదిగో యిదిగో - మీ తండ్రి ఎక్కడున్నాడు?' అని అరిచాను.

'వెల్లకిలా శాండోలా పడుకుని పాడు కలలు కనకపోతే ఒత్తిగిలిపడుకోరాదూ' అని చెప్పిన చరిచింది ఒక్కచరుపు 'దిచ్నారి'.

ప్రేమ అంటే ప్రేయసీప్రియులు ఒకరి కళ్లల్లోకి ఒకరుచూస్తూ కూర్చోవడం కాదు. ఇద్దరూ కలిసి ఒకేలక్ష్యంవేపు దృష్టిసారించడం.-(ఒక పాశ్చాత్యకవి)